# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాజధాని అమరావతిలో నిర్మాణాలు వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించిన మంత్రి పి. నారాయణ.**

2. **రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

3. **రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని పేర్కొన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.**

4. **ఇజ్రాయిల్ – ఇరాన్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ .**

5. **భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు సరోజినీ నాయుడు వర్ధంతి ఈరోజు.**

==========================

రాజధాని అమరావతిలో నిర్మాణాలు వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ సూచించారు. రాజధాని ప్రాంతంలోని నేలపాడులో నిర్మాణంలో ఉన్న అధికారుల భవన సముదాయాలను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ, మాట్లాడుతూ అమరావతిలో భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 30 సెకన్లు

--------------------------

ఆదర్శ విద్యా విధానం లక్ష్యాన్ని సాధించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని విద్యశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సృజనాత్మక విద్యా బోధనతో విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు కె. అరుణకుమారిని అభినందించారు. జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న అరుణకుమారి వినూత్న పద్ధతులతో పాఠాలను

బోధిస్తున్నారని ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కొనియాడారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలతో మాత్రమే కాకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలు రూపొందించడం, పిల్లలతో ప్రత్యక్ష కార్యకలాపాలు చేయించడం వంటి పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఈ బోధన విధానం ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

-----------------------------

రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.బాపట్ల జిల్లా బల్లికురవ మండలం, వేమవరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా 44 సైకిళ్లను మంత్రి నిన్న అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు సైకిళ్లు అందిస్తూ వారి విద్యాభ్యాసానికి బలమైన తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. దాతల సహకారంతో ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేలకుపైగా సైకిళ్లను పూర్తిగా ఉచితంగా విద్యార్థులకు అందించామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------------

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యాన్యతనిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 4.29 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. వీటి ద్వారా పాలకొల్లులోని బ్రాడీపేట బైపాస్ రోడ్డులో కొత్త మంచినీటి చెరువు గట్టు బలోపేతం, వాకింగ్ ట్రాక్, సుందరీకరణ పనులు జరగనున్నాయని తెలిపారు.

-----------------------------

ఇజ్రాయిల్ – ఇరాన్ దేశాల మధ్య ఉద్రికత్తల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని, రాష్ట్ర ఎన్.ఆర్.ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సంఘం –ఏపీఎన్ఆర్టీ ద్వారా ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గాను, గల్ఫ్ దేశాలలో ఉన్న ఏపీఎన్ఆర్టీ అధికారులను అప్రమత్తం చేశామని తెలుపుతూ..

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------------

ముఖ్యమంత్రి కార్యాలయం – సీఎంవో ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ ఈ రోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత నెల 28న ప్రభుత్వకార్యదర్శిగా పదవీ విరమణ చేసిన విజయానంద్ ను ప్రభుత్వం సీఎంవో ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు విజయానంద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

-----------------------------

భారత సైన్యంలో చేరేందుకు ఈ నెల 13వ తేదీ నుండి ఏప్రిల్ 1 వరకు ఆన్ లైన్లో అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని గుంటూరు జిల్లా సైనిక సంక్షేమాధికారిణి గుణశీల తెలిపారు. గుంటూరులో ఆమె ఈ రోజు మాట్లాడుతూ, 17 నుండి 21 సంవత్సరాల మధ్య వయసు ఉండి, పదవ తరగతి, ఇంటర్ చదివిన యువతీ

యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని వివరించారు.

---------------------------

భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ మహిళా నాయకురాలు సరోజినీ నాయుడు వర్ధంతి ఈరోజు. 1879 ఫిబ్రవరి 13 తేదీన హైదరాబాద్లో జన్మించిన ఆమె మహిళా విద్యపై అనేక ఆంక్షలు వున్న ఆ రోజుల్లోనే ఉన్నత విద్యను అభ్యసించారు. మహిళా విద్య కోసం, అంటరానితనం నిర్మూలన కోసం అవిరళ కృషి చేశారు. స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్గా సేవలందించిన ఆమె 1952వ సంవత్సరం కాన్పూర్లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షురాలుగా వ్యవహరించారు. సరోజినీ నాయుడు రచించిన "యాంకిలేట్ బెల్స్" అనే గ్రంథం అనేక విద్యాలయాల్లో పాఠ్యాంశంగా ప్రవేశపెట్టడం విశేషం. 1949 మార్చి 2న ఆమె తుది శ్వాస విడిచారు. సరోజిని నాయుడు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆమె జయంతి ఫిబ్రవరి 13 ను జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించింది.

---------------------------

సమాజంలో వ్యర్థాల సేకరణ కార్మికుల సేవలు ముఖ్యమైనవని, నగర పరిశుభ్రతలో వారి పాత్ర ఎంతో కీలకమని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. విశాఖపట్నం దళిత బహుజన వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యర్థాల సేకరణ కార్మికులకు వారి దైనందిన అవసరాలకు ఉపయోగపడే వంటపాత్రలు, అవసరమైన సామగ్రిని కలెక్టర్ ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జీవనోపాధి, గౌరవాన్ని మెరుగుపరచాలనే ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇది కేవలం సహాయ కార్యక్రమం మాత్రమే కాకుండా, వారి శ్రమకు గుర్తింపు అని పేర్కొన్నారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరిలో వృద్ధి నమోదు చేసిందని రాష్ట్ర పన్నుల విభాగం ముఖ్య కమిషనర్ బాబు.ఏ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నికర జీఎస్టీ వసూళ్లు 3 వేల 61 కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరిలో వసూలైన నికర జీఎస్టీ కంటే ఇది 5.45 శాతం అధికమని పేర్కొన్నారు. పన్ను ధరల తగ్గింపులు, వ్యూహాత్మక చర్యలు, మెరుగైన విధానాల వల్ల వినియోగం పెరగటం రాష్ట్ర ఆదాయ వృద్ధికి దోహదపడిందని తెలిపారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ వసూళ్లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరిలో వృద్ధి నమోదు చేసిందని రాష్ట్ర పన్నుల విభాగం ముఖ్య కమిషనర్ ఎ.బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నికర జీఎస్టీ వసూళ్లు 3 వేల 61 కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరిలో వసూలైన నికర జీఎస్టీ కంటే ఇది 5.45 శాతం అధికమని పేర్కొన్నారు. పన్ను ధరల తగ్గింపులు, వ్యూహాత్మక చర్యలు, మెరుగైన విధానాల వల్ల వినియోగం పెరగటం రాష్ట్ర ఆదాయ వృద్ధికి దోహదపడిందని తెలిపారు.

---------------------------

చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని రేపు మూసివేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. రేపు ఉదయం 9గంటల నుంచి రాత్రి 7 గంటల 30 నిమిషాలకు వరకు ఆలయాన్ని మూసి వేస్తున్నట్టు పేర్కొంది.

=====================